క్లుప్తంగా

28న మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

తెనాలిఅర్బన్: తెనాలి మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని 28న నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం మూడు గంటలకు మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో జరిగే సమావేశానికి మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షతన వహిస్తారని చెప్పారు. సమావేశంలో కౌన్సిలర్‌లు, కో–ఆప్షన్ సభ్యు లు, ఎక్స్ ఆఫీషియో సభ్యులు పాల్గొనాలని కోరారు.

గాలి ద్వారా వ్యాపించే వ్యాధి క్షయ



తెనాలిఅర్బన్: గాలి ద్వారా క్షయ వ్యాధి వ్యాప్తి చెందే అవకాశం ఉందని టీబీ యూనిట్ సూపర్‌వైజర్ పల్లికొండ రవికుమార్ పేర్కొన్నారు. భాష్యం స్కూల్‌లో క్షయవ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు వారాల నుంచి దగ్గు, జలుబు, జ్వరం ఉంటే వెంటనే రక్తపరీక్షలు చేయించుకోవాలన్నారు. బరువు తగ్గడం, ఆకలి మందగించడం వంటివి క్షయ లక్షణాలు అని చెప్పారు. సమావేశంలో ప్రిన్సిపల్ మోహన్‌దాసు, సిబ్బంది పాల్గొన్నారు.

13 బైక్‌లు సీజ్



తెనాలిరూరల్: బైక్‌లకు కంపెనీ ఇచ్చిన సైలెన్సర్ కాకుండా పెద్ద శబ్దం వచ్చేలా వేరే సైలెన్సర్‌లు ఏర్పాటు చేయడం నిబంధనలకు విరుద్ధమని రవాణా శాఖ అధికారులు తెలపారు. తెనాలి రవాణా శాఖ అధికారులు మంగళవారం సాయంత్రం వాహన తనిఖీలు చేపట్టారు. రవాణా శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ద్విచక్రవాహన తనిఖీ ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించారు. సైలెన్సర్లు మార్చిన బైక్‌లు 13 గుర్తించి వాటిని సీజ్ చేసి యజమానులకు రూ.70 వేలు జరిమానా విధించారు. తనిఖీలో మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్ తోట రాఘవరావు, ఏఎంవీఐలు ఎస్‌బీ మధుసూదనరావు, జి.అమృతరాణి పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ



తెనాలిఅర్బన్: లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి స్నేహ సభ్యులు గార్లపాటి రామసత్య శ్రీనివాసరావు సహకారంతో సత్యనారాయణ టాకీస్ రోడ్డులోని మున్షీ మస్తాన్ మున్సిపల్ ఉర్దూ ఎలిమెంటరీ స్కూల్‌లోని విద్యార్థులకు మంగళవారం నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, వాటర్‌బాటిళ్లు, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపకుడు కాకరపర్తి సుబ్రమణ్యం, అధ్యక్షుడు నేరెళ్ళ కృష్ణమోహనరావు, డాక్టర్ కొత్తపల్లి రాజకుమార్, నంబూరు శ్రీకుమార్, హెచ్‌ఎం షేక్ దిల్ బహర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ బిల్లుల చెల్లింపునకు అవకాశం

తెనాలిటౌన్: మహాశివరాత్రి పర్వదినమైనప్పటికి తెనాలి డివిజన్‌లోని అన్ని విద్యుత్ రెవెన్యూ కార్యాలయాలు, మీ సేవ సెంటర్లు, సెక్షన్ ఆఫీసుల వద్ద వినియోగదారుల సౌకర్యార్థం విద్యుత్ బిల్లులు చెల్లించే ఏర్పాట్లు చేసినట్లు విద్యుత్ తెనాలి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వి.వి.చిరంజీవి తెలిపారు. ఆన్‌లైన్ విధానంలో వెబ్‌సైట్ ద్వారా లేదా ఏపీసీపీడీసీఎల్ మొబైల్ యాప్, ఫోన్ పే, గూగుల్ పే ద్వారా కూడా సులభంగా విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చని సూచించారు. సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించి సంస్థ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు.

పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోండి



తెనాలిఅర్బన్: పుస్తక పఠనంపై ఆసక్తిని పెంచుకోవాలని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసర్ వి.రవికుమార్ పేర్కొన్నారు. జేఎంజే కళాశాల 28వ వార్షికోత్సవాన్ని కళాశాల ఆవరణలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పుస్తకాలను ఎక్కువగా చదవడం వల్ల జ్ఞానం పెరుగుతుందన్నారు. విశ్రాంత ప్రిన్సిపల్ డాక్టర్ ఆలపాటి వెన్నమాట్లాడుతూ తాను జేఎంజే కళాశాలలో చదువుకున్నానని, ఆనాటి రోజులను గుర్తు తెచ్చుకున్నారు. సమావేశంలో కరస్పాండెంట్ సిస్టర్ థెరిస్సామ్మ, ప్రిన్సిపల్ సిస్టర్ షైనీ, వైస్ ప్రిన్సిపల్ సిస్టర్ మేరి శారద పాల్గొన్నారు.

సుమనో‘హరుడి’ దివ్యక్షేత్రం

- త్రేతాయుగంలో పరశురాముడి ప్రతిష్ట
- శ్రీపర్వతవర్ధినీ సమేత శ్రీరామేశ్వరస్వామి దేవస్థానం
- నేడు మహాశివరాత్రి పర్వదినం



శ్రీరామేశ్వరస్వామి దేవస్థానం

తెనాలి: మహాశివరాత్రి పర్వదినం..శైవక్షేత్రాలు భక్తులతో కళకళలాడుతున్నాయి. అభిషేకాలు, హారతులతో స్వామివారు నిత్యం దేదీప్యమానంగా వెలుగుతొందుతూ భక్తులకు కనువిందు చేస్తుంటారు. కోరిన కోర్కెలను తీరుస్తారన్న విశ్వాసంతో భక్తులు నియమనిష్టలతో కొలిచే ఆలయాల్లో, తెనాలిలో పాత శివాలయంగా పిలుచుకునే శ్రీపర్వతవర్ధినీ సమేత శ్రీరామేశ్వరస్వామి దేవస్థానం ఒకటి. మహాశివరాత్రి సందర్భంగా ఇక్కడ ఈనెల 23 నుంచి పాంచాహ్నిక దివ్య కల్యాణ మహోత్సవాలు జరుగుతున్నాయి.

త్రేతాయుగంలో పరశురాముడు ప్రతిష్ఠించిన శివాలయమిది. స్థానిక గంగానమ్మపేటలోని ఈ ఆలయంలో స్వామివారు భక్తులు కోరిన కోర్కెలను తీర్చే కొంగుబంగారంగా భాసిల్లుతున్నాడు. ఇక్కడ అష్టభుజ దుర్గాదేవి ఆలయం ప్రత్యేకమైంది. బాలకుమారస్వామి ఆలయం, అయ్యప్ప స్వామి కోవెల, నవగ్రహాల మండపం, పదో శతాబ్దం నాటి జైనతీర్థంకరుడూ ఇక్కడ పూజలు అందుకుంటున్నారు. ఆలయాన్ని సందర్శించి, స్వామివార్లను మనఃపూర్వకంగా కొలిచిన వారికి గ్రహదోషాల నివారణ, పెళ్లికాని వారికి పెళ్లి, సంతాన ప్రాప్తి కలుగుతుందని భక్తుల విశ్వాసం. వివిధ మతాల భక్తులు శుభకార్యాల్లో ఇక్కడ పొంగళ్లు పెడుతుంటారు.

‘బాణలింగం’గా ప్రసిద్ధి..

శ్రీరామేశ్వరస్వామికి గల ప్రత్యేకతల్లో స్వామి పశ్చిమాభిముఖంగా ఉంటారు. గౌరీశంకరాత్మకమై బాణాకారంగా ఉండి, గోధుమ వర్ణంతో ‘బాణలింగం’గా ప్రసిద్ధి చెందారు. ఫాల్గుణ అమావాస్య మొదలు పక్షం రోజులు ప్రదోషకాలంలో సూర్యకిరణాలు స్వామివారిని స్పృశిస్తూ వెళుతుంటాయి. శృంగేరీ పీఠాధిపతులు అభినవ తీర్థమహాస్వామి, జగద్గురువులు కంచి పీఠాధిపతులు జయేంద్ర సరస్వతి స్వామి, పరమాచార్యులు చంద్రశేఖర సరస్వతి స్వాములు వివిధ సందర్భాల్లో ఇక్కడకు విచ్చేసి శంకుస్థాపనలు, ప్రతిష్ఠలు, పునఃప్రతిష్ఠలు, కుంభాభిషేకాలు చేశారు.

స్థలపురాణంలోకి వెళితే..

త్రేతాయుగంలో పరశురాముడు 21 పర్యాయాలు భూప్రదక్షిణ చేసి క్షత్రియుల నిర్మూలన చేస్తాడు. పాప పరిహారార్థం 1001 శివాలయాలను ప్రతిష్ఠిస్తాడు. ఆ క్రమంలోనే ఇక్కడ శ్రీరామేశ్వరస్వామి దేవాలయాన్ని ప్రతిష్ఠించాడు. అప్పట్లో ఇదంతా జనావాసం లేని కృష్ణానదీ తీరప్రాంతం. కాలక్రమంలో నది వెడల్పు తగ్గిపోయింది. జనావాసాలు ఏర్పడ్డాయి. శాలివాహన శకం 1062 (క్రీ.శ. 1140)లో గణపతి దేవుల పాలనలో ప్రధానమంత్రి గోపరాజు రామన్న ఈ ప్రాంతాన్ని దానంగా స్వీకరించారు. తెనాలికి తురకా వెంకన్న అనే నియోగి బ్రాహ్మణుడిని గ్రామకరణీకం మిరాశీగా నిర్ణయించారు. శాలివాహన శకం 1160 (క్రీ.శ 1238)లో ఓరుగల్లు పాలకులు గణపతి దేవుల గురువు శివయోగీశ్వరులకు ముదిగొండ గ్రామం దానం చేశారు. అక్కడ నివాసముంటున్న శివయోగీశ్వరులను ప్రతాపరుద్రుడు తెనాలికి తీసుకొచ్చారు. ఆలయానికి స్థానాచార్యులుగా నియమించారు. నివాస గృహాలను నిర్మించి ఇచ్చారు.

రామకృష్ణ కవికి ఆధారం ఇక్కడే..

వికటకవిగా ప్రసిద్ధుడైన తెనాలి రామకృష్ణకవి స్వస్థలం తెనాలికి సమీపంలోని అదృశ్య గ్రామం గారపాడు. తెనాలిలోని మేనమామ ఇంట్లో ఉంటూ చదువుకున్నారు. శ్రీరామేశ్వరస్వామి ఆలయంలోని అష్టభుజ దుర్గాదేవికి భక్తుడిగా మారి అర్చన చేశాడు. నిరంతరం పూజలతో దుర్గాదేవిని ప్రసన్నం చేసుకుని ‘వికటకవి’గా మారాడు. పండితుడై తెనాలి రామకృష్ణకవిగా శ్రీకృష్ణదేవరాయలు ఆస్థానంలోకి వెళ్లారు. ఇక్కడి ఆలయంలోని స్వామివార్ల ఉత్సవ విగ్రహాలు చోరీకి గురయ్యాయి. మన స్థానానికి లోనైన భక్తులు, తెనాలి రామకృష్ణను కలిసి, చోరీ వృత్తాంతాన్ని తెలియజేశారు. వారి అభీష్టం మేరకు తెనాలి రామకృష్ణకవి ఇక్కడి ఆలయానికి స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా తయారు చేయించి, ఆలయానికి సమర్పించారు. మళ్లీ కొంతకాలం తర్వాత రామకృష్ణకవి ఇచ్చిన ఉత్సవ విగ్రహాల్లో అమ్మవారి విగ్రహం అదృశ్యమైంది. దాని స్థానంలో వేరొకటి తయారుచేయించారు. 1966లో ఆలయ జీర్ణోద్ధరణ సమయంలో దుర్గాదేవి విగ్రహం బయటపడింది. శక్తిస్వరూపిణి అయిన అమ్మను పూజించటానికి భయపడిన భక్తులు, శాంతస్వరూపిణి శ్రీపర్వతవర్ధినిని ప్రతిష్ఠించారు. దుర్గాదేవి అమ్మవారికి 2006లో మరొక ఆలయం నిర్మించారు. 1966 తవ్వకాల్లోనే 8,9 శతాబ్దాల నాటి జైనతీర్థంకరుడి విగ్రహం బయటపడింది. ఈ విగ్రహాన్ని భద్రంగా ఆలయ పడమర ప్రాకారంలో అమర్చారు. స్వామివారి ఆలయం 1987లో దేవదాయశాఖ పరిధిలోకి వెళ్లింది. ఆరు–బీ ఆలయంగా రికార్డులో ఉంది. ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులుగా ఎస్‌బీ శివ, కె.భాస్కరరావు వ్యవహరిస్తున్నారు.



అష్టభుజ దుర్గాదేవి



తెనాలి రామకృష్ణకవి బహూకరించిన ఉత్సవ విగ్రహం



కీ.శ 8,9 శతాబ్దాలనాటి జైనతీర్థంకరుడు

ఆలయ వంశపారంపర్య అర్చకులుగా చావలి హనుమకుమార్ (పసి), పెనుమూడి సుబ్బారావు, పాత్తూరి వెంకట సురేష్, పాత్తూరి శ్రీకాంత్, పాత్తూరి రమేష్ అర్చకత్వ విధుల్లో కొనసాగుతున్నారు. ప్రస్తుతం పాత్తూరి వెంకట సురేష్ ఆధ్వర్యంలో పాంచాహ్నిక దివ్య కళ్యాణోత్సవం కొనసాగుతోంది.

మహాశిరాత్రికి స్వామివారి వైభవం



మహాశివరాత్రికి పాంచాహ్నిక దివ్యకల్యాణ మహోత్సవాలను జరుపుతున్నాం. 23న స్వామివారిని పెండ్లికుమారుడిని చేశాం. 24న మయూర వాహనోత్సవం, 25న శేషవాహన సేవ, నరనంది వాహనసేవ జరిపాం. మహాశివరాత్రి రోజున తెల్లవారుజాము నుంచి విశేష అభిషేకాలు, రావణబ్రహ్మ వాహనసేవ, లింగోద్భవ కాల అభిషేకాలు, రాత్రి 12.15కు శ్రీస్వామి–అమ్మవార్ల ఎదురుకోల ఉత్సవం, 1.35కు శ్రీపర్వత వర్ధినీ–శ్రీరామేశ్వరస్వామి వార్ల దివ్య కల్యాణోత్సవం ఉంటుంది. 27న నంది వాహన సేవ, సాయంత్రం 4.30 నుంచి దివ్య రథోత్సవం అంగరంగ వైభవంగా జరుగుతాయి. 28న శ్రీస్వామి, అమ్మవార్లకు వసంతోత్సవం ఉంటాయి.

– వీవీ రమణకుమారి, ఆలయ ఈవో

శివాలయాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేయండి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న



తెనాలిఅర్బన్: మహాశివరాత్రి పర్వదినం నేపథ్యంలో పట్టణంలోని శివాలయాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. గంగానమ్మపేటలోని పాత శివాలయాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. భక్తుల సౌకర్యార్థం తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. దేవాలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే దేవాలయ పరిసరాల్లో ఎటువంటి వ్యర్థాలు లేకుండా చూడాలన్నారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ ఉద్యోగులు ఉన్నారు.

ఇంటర్ పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్

తెనాలి రూరల్: ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగనున్న నేపథ్యంలో తెనాలిలోని 2 పరీక్షా కేంద్రాల వద్ద మంగళవారం నుంచి మార్చి 20వ తేదీ వరకు 144 నిషేధాజ్ఞలు అమల్లో ఉంటాయని తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ మంగళవారం తెలిపారు. పరీక్ష కేంద్రాలకు 500 మీటర్ల దూరంలోని జిరాక్స్ షాపులన్నిటినీ ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు మూసి వేయాలన్నారు. ఎక్కడా గుంపులుగా ప్రజలు ఉండకూడదని, నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలుంటాయని స్పష్టం చేశారు. ఈ మేరకు తగిన సిబ్బందిని ఏర్పాటు చేసి తగు చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాలైన విద్యా సంస్థల యాజమాన్యాలు పోలీసు శాఖ సమన్వయంతో ఈ నెల 28 లోగా తనకు పరీక్షా కేంద్రాల వద్ద తీసుకున్న భద్రతా చర్యలపై నివేదిక ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. అలానే పరీక్షా కేంద్రాల వద్ద వైద్య సదుపాయం, ఫస్ట్ ఎయిడ్ కిట్‌లు ఉండేలా చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. నిబంధనలను పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

5వ తేదీ వరకు 144 సెక్షన్

తెనాలిరూరల్: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం నుంచి మార్చి 5వ తేదీ వరకు 144 నిషేధాజ్ఞలు అమల్లో ఉంటాయని తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ తెలిపారు. 144 సెక్షన్‌ను అమలు చేయాలని పోలీసులను ఆదేశిస్తూ ఉత్తర్వులు మంగళవారం జారీ చేశారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రజలు సహకరించాలని, ఏదైనా అలజడులు, అసాంఘిక కార్యకలాపాలు జరిగితే సమీపంలోని పోలీస్‌స్టేషన్‌కు లేదా తన నంబరు 9849904023కి ఫోన్ చేసి సమాచారమందించాలని కోరారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



సిబ్బందికి సూచనలిస్తున్న అధికారులు

తెనాలిరూరల్: ఈ నెల 27న జరగనున్న ఉమ్మడి కృష్ణ–గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా పట్టణంలో ఏర్పాటు చేసిన పలు పోలింగ్ కేంద్రాలను అధికారుల బృందం మంగళవారం పరిశీలించింది. సబ్ కలెక్టర్ సంజన సింహ నేతృత్వంలో తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్ బి.శేషన్న బృందం పోలింగ్ కేంద్రాలలో విద్యుత్ సరఫరా, తాగునీరు, మరుగుదొడ్లు తదితర ఏర్పాట్లను పరిశీలించారు. గంగానమ్మపేట తోటకూర సుబ్బారావు హైస్కూల్, చెంచుపేట కోగంటి శివయ్య మున్సిపల్ హైస్కూల్, మారీసుపేట ఎన్‌సీఆర్‌ఎం హైస్కూల్ తదితర పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పోలింగ్ కేంద్రాలలో ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. మున్సిపల్ ఇంచార్జ్ ఎంఈ శ్రీనివాసరావు, మండల వ్యవసాయ అధికారి జి. ప్రేమ్ సాగర్, టౌన్ ప్లానింగ్ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై వీఆర్వోలతో సమీక్ష

ఈ నెల 27న జరుగనున్న కృష్ణ గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా గ్రామ రెవెన్యూ అధికారులతో మంగళవారం తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ సమీక్ష జరిపారు. ఓటరు స్లిప్పులు పంపిణీ వివరాలు తెలుసుకున్నారు. ఓటర్లను ప్రభావితం చేసే చర్యలపై ఎలాంటి సమాచారం ఉన్నా వెంటనే స్పందించాలని, మొత్తంగా పోలింగ్ ప్రశాంతంగా ముగిసేంత వరకూ అప్రమత్తంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. ఏదైనా అత్యవసర పరిస్థితులుంటే వెంటనే సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. 144 సెక్షన్ అమలుకు ఆదేశించారు. సమావేశంలో వీఆర్వోలు, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీఎన్జీవోస్ తెనాలి అధ్యక్షునిగా మన్నె



ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం



మాట్లాడుతున్న సెక్రటరీ కృష్ణమోహన్

తెనాలిటౌన్: ఏపీఎన్‌జీవోస్ తెనాలి తాలూకా యూనిట్ నూతన అధ్యక్షునిగా మన్నె మల్లికార్జునరావు నియమితులయ్యారు. నిన్నటి వరకు అధ్యక్షునిగా పనిచేసిన బి.శ్రీనివాస్ అనారోగ్య కారణాల రీత్యా పదవికి రాజీనామా చేయడంతో జిల్లా అధ్యక్షుని ఆదేశాల మేరకు మంగళవారం స్థానిక కొత్తపేటలోని ఎన్‌జీవో హోమ్‌లో కో–ఆప్షన్ ఎన్నిక నిర్వహించారు. జిల్లా అబ్జర్వర్‌గా ఎ.శ్యామ్‌సుందర్ శ్రీనివాస్, సహ అబ్జర్వర్‌గా ఎస్.వెంకటరెడ్డి విచ్చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఎన్నికల్లో మెజారిటీ సభ్యుల ఆమోదం మేరకు అధ్యక్షునిగా మన్నె మల్లికార్జునరావు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా బి.శ్రీనివాస్, ఉపాధ్యక్షునిగా పి.సుధాకర్, జాయింట్ సెక్రటరీగా జె.అశోక్‌కుమార్, మహిళా విభాగం ఉపాధ్యక్షురాలిగా ఎస్.లక్ష్మి, మహిళా విభాగం జాయింట్ సెక్రటరీగా కె.చంద్రకళ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గంచే జిల్లా అబ్జర్వర్ శ్యామ్‌సుందర్ శ్రీనివాస్ ప్రమాణస్వీకారం చేయించారు. అధ్యక్షుడు మన్నె మల్లికార్జునరావు మాట్లాడుతూ 3వ సారి ఎన్‌జీవోస్ తెనాలి యూనిట్ అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు. తనపై నమ్మకంతో తన ఎన్నికకు సహకరించిన సభ్యులందరికీ రుణపడి ఉంటానని తెలియజేశారు. సభ్యుల యోగక్షేమాలతో పాటు ప్రభుత్వం నుంచి ఉద్యోగులకు రావాల్సిన రాయితీలు సాధించడంలో శక్తివంచన లేకుండా కృషి చేస్తానని వెల్లడించారు. కార్యక్రమంలో పలువురు ఎన్‌జీవోస్ సభ్యులు పాల్గొన్నారు.

‘అక్రమంగా తెనాలి ఎన్‌జీవోస్ అధ్యక్షుని ఎన్నిక’

తెనాలిటౌన్: అక్రమంగా, కుట్రపూరితంగా ఏపీ ఎన్‌జీవోస్ తెనాలి తాలూకా యూనిట్ అధ్యక్ష, కో–ఆప్షన్ సభ్యుల ఎన్నిక జరిగిందని సెక్రటరీ బేతాళ కృష్ణమోహన్ ఆరోపించారు. స్థానిక ఎన్‌జీవో కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెనాలి తాలూకా యూనిట్ సెక్రటరీగా పనిచేస్తున్న తనకు తెలియకుండా నిన్నటి వరకు ప్రెసిడెంట్‌గా పనిచేసిన బి.శ్రీనివాస్ జిల్లా అధ్యక్షునికి రాజీనామా లేఖ పంపినట్లు ఆరోపించారు.

ఆయన రాజీనామాను ఆమోదిస్తూ జిల్లా అధ్యక్షుడు ఈ నెల 22వ తేదీ తెనాలిలో నూతన అధ్యక్షుని ఎన్నిక చేపట్టవలసినదిగా అకస్మాత్తుగా ఆదేశాలు ఇచ్చినట్లు తెలియజేశారు. తగినంత మంది సభ్యులు లేకపోవడంతో వాయిదా వేసి తమకు చెప్పపెట్టకుండా ఈరోజు అధ్యక్ష, కో–ఆప్షన్ సభ్యుల ఎన్నికకు తెరలేపినట్లు విమర్శించారు. ఇరుపక్షాల వాదనలు వినకుండా జిల్లా నుంచి వచ్చిన ఎన్నికల పరిశీలకులు నిబంధనలకు విరుద్ధంగా నియమకం చేపట్టినట్లు ఆరోపించారు. ఈ చర్యలను నిరసిస్తూ ఎన్నికను బహిష్కరించి వెళ్తున్నట్లు తెలియజేశారు. ఏపీఎన్‌జీవోస్ తెనాలి యూనిట్‌కు సంబంధించి అనేక అక్రమాలు జరిగాయని, వాటన్నింటిని బయట పెడతామని హెచ్చరించారు.


విజయానికి అడ్డదారులు ఉండవు

తెలంగాణ రాష్ట్ర జీఎస్టీ జాయింట్ కమిషనర్ యడ్ల శ్రీలీల



తెనాలి: హైస్కూలు దశ నుంచి విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకొని, ప్రణాళికాబద్ధంగా కృషిచేసి విజయాన్ని సాధించాలని తెలంగాణ రాష్ట్ర జీఎస్టీ జాయింట్ కమిషనర్ యడ్ల శ్రీలీల సూచించారు. విజయానికి అడ్డదారులు ఉండవనీ, కష్టపడి పనిచేసి సాధించటమే ఏకైక మార్గమన్నారు. సమస్యలెన్ని వచ్చినా నిర్ణయించుకున్న లక్ష్యాన్ని వదులుకోరాదని, పట్టుదలతో ముందుకు సాగాలని చెప్పారు. స్థానిక మున్సిపల్ బాలుర హైస్కూలులో మంగళవారం పూర్వవిద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ‘స్ఫూర్తి’ కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. యడ్ల శ్రీలీల ముఖ్యఅతిథిగా హాజరై పదోతరగతి విద్యార్థులకు పరీక్షలకు సన్నద్ధతపై ప్రత్యేక ప్రసంగం చేశారు. పాఠశాల పురోభివృద్ధికి పూర్వ విద్యార్థుల సంఘం చేస్తున్న చేపడుతున్న కార్యక్రమాలనూ ఆమె ప్రశంసించారు. తెనాలి మండల విద్యాశాఖ అధికారి డాక్టర్ మేకల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పదోతరగతి విద్యార్థులకు ప్రేరణ కలిగించేలా పాఠశాలలో చక్కని స్ఫూర్తినిచ్చే కార్యక్రమాన్ని పూర్వ విద్యార్థుల సంఘం నిర్వహించడం అభినందనీయమని అన్నారు. పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం కన్వీనర్ తన్నీరు శివశంకర్ మాట్లాడుతూ దూరవిద్యలో విద్యను అభ్యసించి అంచలంచెలుగా పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధిస్తూ తెలంగాణ రాష్ట్రానికి జీఎస్టీ జాయింట్ కమిషనర్‌గా ఎదిగిన శ్రీలీల జీవితాన్ని విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. శ్రీలీలకు పాఠశాల ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థి సంఘ నాయకులు స్వాగతం పలికి, సత్కరించారు. ప్రధానోపాధ్యాయిని షేక్ మౌలాబీ, రిటైర్డ్ తెలుగు ఉపాధ్యాయుడు తన్నీరు సుబ్బారావు పాల్గొన్నారు.

నేడు కోటప్పకొండ చరిత్ర ప్రదర్శన



తెనాలిరూరల్: కోటప్పకొండ స్థలపురాణ చరిత్ర మహాత్మ్యాన్ని మహాశివరాత్రి సందర్భంగా భక్తుల కోసం కోటప్పకొండలో బుధవారం రాత్రి ప్రదర్శిస్తున్నట్లుగా ‘మా–ఏపీ’ (మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్) వ్యవస్థాపకులు, సినీ దర్శకులు దిలీప్ రాజా తెలిపారు. పెదరావూరు ఫిల్మ్ స్టూడియోస్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతు ‘ మా– ఏపీ’ నుంచి నరేష్ దోనె, మణివరస్‌లను ‘కోటప్పకొండ’ ఓటీటీ చిత్రంతో దర్శకులుగా పరిచయం చేస్తున్నట్లు చెప్పారు. మహాశివరాత్రి రోజున కోటప్పకొండను దర్శించుకునే 15 లక్షలకుపైగా భక్తుల కోసం ప్రత్యేక స్క్రీన్లను ఏర్పాటు చేసి తెల్లవార్లు చిత్రాన్ని ప్రదర్శిస్తున్నామని పేర్కొన్నారు. ఈ చిత్రాన్ని దూరదర్శన్ సప్తగిరి శివరాత్రిరోజున రాత్రి 9 గంటలకు ప్రసారం చేస్తుందని దిలీప్ రాజా చెప్పారు.

ప్రకృతి సేద్యం లాభదాయకం

తెనాలి ఏడీఏ ఉషారాణి



అవగాహన కల్పిస్తున్న తెనాలి ఏడీఏ ఉషారాణి

కొల్లిపర: ప్రకృతి వ్యవసాయం లాభదాయకమని, రైతులు ఈ విధానంపై అవగాహన పెంచుకోవాలని తెనాలి ఏడీఏ ఎస్.ఉషారాణి చెప్పారు. మంగళవారం మున్నంగి గ్రామంలోని రైతుసేవా కేంద్రం వద్ద ప్రధాన మంత్రి ప్రణామ్ భూసార పరిరక్షణ పథకం ద్వారా మద్రాస్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నేల ఆరోగ్యంపై రైతులకు శిక్షణ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా తెనాలి ఏడీఏ ఉషారాణి పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ మండలంలో మొక్కజొన్న, జొన్న పంటలకు రైతులు యూరియా ఎరువును వినియోగించాల్సిన దాని కంటే రెండు రెట్లు అధికంగా వినియోగించారని, దీంతో రానురాను భూమి సారవంతం కోల్పోయి జీవం లేని పంట భూములుగా మారుతాయని, దీనివలన భూమి నీరు పీల్చుకొనే శక్తి కోల్పోతుందని, సుమారు 30 సంవత్సరాలు క్రితం ఉన్న భూములను ,ఇప్పుడు ఉన్న పంట భూములను ఆనాటి రైతులు పరిశీలిస్తే భూమి లో ఎంత తేడాలు కలిపిస్తాయని వివరించారు. గ్రామంలో ప్రతి రైతులు గమనించి రసాయనిక ఎరువులు పూర్తిగా తగ్గించి , సేంద్రియ పద్ధతుల ద్వారా వ్యవసాయం చేయాలని సూచించారు. జొన్న ,మొక్కజొన్న పంటలకు పురుగు మందులు బదులు వేప నూనె వాడాలని, ఎరువులు వినియోగం తగ్గించి వాటి స్థానంలో లిక్విడ్‌తో కూడిన నానో యూరియ, కాంప్లెక్స్ ఎరువులు వాడాలన్నారు. మద్రాస్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ చీఫ్ మేనేజర్ ఉమా శంకర్ మాట్లాడుతూ సేంద్రియ ఎరువులు ప్రతి రైతు ఉపయోగించటం వలన ముందు తరాల రైతులకు మేలైన, సారవంత భూమి అందించిన వారుగా చరిత్రలో నిలిచి ఉంటామన్నారు. అనంతరం మద్రాస్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ వారు కేంద్ర ప్రభుత్వంతో కలిసి ఎలా సేంద్రియ ఎరువులు తయారు చేస్తుంది, వాటిని రైతులు ఏ పంటలకు వాడాలి అన్న అంశాలను వివరించారు. అనంతరం రైతులకు సేంద్రియ ఎరువుల పరిజ్ఞానంపై క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. తొలుత గ్రామంలో మొక్కజొన్న పంటలో సేంద్రియ ఎరువులు ఏ విధంగా వాడాలి అన్న అంశాలను క్షేత్ర ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కె.వెంకటరా వు, మద్రాస్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ మేనేజర్ చంద్రశేఖర్, ఉపసర్పంచ్ ఆళ్ల నాగిరెడ్డి, కళ్ళం వెంకటప్పారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

అబాకస్ ఎక్స్‌పోను సద్వినియోగం చేసుకోండి



ఎక్స్‌పోను పరిశీలిస్తున్న విద్యార్థులు

తెనాలిఅర్బన్: అబాకస్ ఎక్స్‌పో కార్యక్రమాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని నెహ్రూ నికేతన్ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్ పేర్కొన్నారు. బోసురోడ్డులోని నెహ్రూ నికేతన్ స్కూల్‌లో అబాకస్ ఎక్స్‌పో పేరుతో మంగళవారం ఏర్పాటు చేసిన గణిత విద్య, వైజ్ఞానిక ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. 2 నుంచి 7వ తరగతి చదివే విద్యార్థులు వివిధ అంశాలకు సంబంధించిన నమూనాలను ప్రదర్శనలో ఉంచి వాటి వివరాలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌కు చెందిన విశ్వం ఎడ్యుటెక్ సంస్థ సహకారంతో తమ స్కూల్‌లో తొమ్మిది సంవత్సరాల నుంచి అబాకస్ తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో విశ్వ ఎడ్యుటెక్ గుంటూరు జోనల్ మేనేజర్ సీహెచ్.గంగాధర్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వల్ప విషయమై దాడి

తెనాలిరూరల్: స్వల్ప విషయమై వ్యక్తిపై దాడి చేసి గాయపర్చిన ఘటనపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. స్థానిక వైకుంఠపురానికి చెందిన కరిమస్తాన్‌ను స్వల్ప విషయమై అదే ప్రాంతానికి చెందిన సందీప్ దాడి చేసి గాయపర్చాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.